స్టాండింగ్ కమిటీ నామినేషన్లన్నీ ఓకె

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించి దాఖలైన 20 నామినేషన్లు సక్రమంగా ఉన్నందున వాటన్నింటినీ ఆమోదించినట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్ సహా టీడీపీ నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది నామినేషన్లు వేశారు. నిబంధనల ప్రకారం నామినేషన్ పత్రాలు ఉండడంతో వాటన్నింటినీ అనుమతిస్తున్నట్టు కమిషనర్ వివరించారు. నామినేషన్లను ఎవరైనా ఉపసంహరించుకోవాలనుకుంటే ఆగస్టు నెల మూడో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ గడువు ఉందన్నారు. ఏడున ఎన్నిక, అదేరోజు ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

నేడు వయనాడ్, నాడు కోడిపుంజువలస..

పద్దెనిమిదేళ్ల క్రితం గిరిజన గ్రామంపై విరుచుకుపడిన కొండచరియలు

- బురదతో కూడిన వరద ముంచెత్తడంతో 19 మంది సజీవ సమాధి



కోడిపుంజువలస గ్రామంపైకి వరదలా వచ్చిన బురద (ఫైల్) (ఇన్‌సెట్‌లో) తల్లీ, బిడ్డ మృతి (ఫైల్ ఫొటో)

- పదుల సంఖ్యలో గాయాలపాలు
- భారీగా మూగజీవాలు మృత్యువాత
- ఇళ్లు నేలమట్టం
- హుద్‌హుద్ తుఫాన్‌కు మేదరశాల గ్రామంపైకి కొండచరియలు రావడంతో ఆరుగురు మృతి
- నాటి ఘటనలను జ్ఞప్తికి తెచ్చుకుంటున్న గిరిజనులు

అరకులోయ, జూలై 31: కేరళలోని వయనాడ్‌లో బురదతో కూడిన వరద ముంచెత్తడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. సోమవారం అర్ధ రాత్రి 1.30 సమయంలో వరద బీభత్సానికి కొండ చరియలు విరిగిపడ్డాయి. ముండక్కై గ్రామాన్ని తుడిచిపెట్టేశాయి. ఆ గ్రామంలో నివసిస్తున్న వందల మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. సరిగ్గా... ఇటువంటి ఘటనే పద్దెనిమిదేళ్ల క్రితం అరకులోయ మండలం శిరగాం పంచాయతీ కోడిపుంజువలస గ్రామంలో చోటుచేసుకుంది. 2006 ఆగస్టు 3వ తేదీ రాత్రి సమీపంలో గల కొండ చరియలు, బురదతో కూడిన వరద గ్రామాన్ని ముంచెత్తాయి. ఈ ఘటనలో 19 మంది సజీవ సమాధి కాగా, పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. నాటి ఘటనను ఈ ప్రాంతవాసులు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.

అరకులోయ మండలం కోడిపుంజువలస గ్రామం...2006 ఆగస్టు 3వ తేదీ అర్ధరాత్రి అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా కొండచరియలు విరుచుకుపడ్డాయి. వాయుగుండం ప్రభావంతో అప్పటికి అరకులోయ పరిసరాల్లో నాలుగు రోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో వరద బురద రూపంలో పోటెత్తింది. దీంతో 19 మంది సజీవ సమాధి అయ్యారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న చొంపికొండ పైనుంచి బండ రాళ్లు దొరుకుంటూ వచ్చాయి. వరద ఉధృతికి చాలామంది నిద్రలోనే దిగువనున్న గెడ్డలోకి కొట్టుకుపోయారు. మూగ జీవాలు కూడా వరద ప్రవాహంలో ... మిగతా 6వ పేజీలో

సమయ పాలన పాటించాలి

వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆస్పత్రుల్లో ఉండాల్సిందే

- ప్రైవేటు కంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువ జరిగేలా చూడాలి
- ఆరోగ్య శాఖ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఆరోగ్య కేంద్రాల్లో ఉండాల్సిందేనన్నారు. బుధవారం జగదాంబ సెంటర్ ప్రాంతంలో గల బీల్ జంక్షన్ హాలులో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అధ్యక్షతన పట్టణ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ సమయ పాలన విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో ఓపీ పెంచగలిగితే కేజీహెచ్‌లో రద్దీని తగ్గించ వచ్చునన్నారు. వైద్యులు అందుబాటులో ఉంటే ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రసవాలు ప్రైవేటు కంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఎక్కువ జరిగేలా చూడాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో నెలకు కనీసం ఐదు ప్రసవాలు తప్పనిసరిగా జరిగేలా చూడాలని ఆదే శించారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన పథకాన్ని ఎక్కువ మందికి చేరేలా చూడాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు అందరికీ ఇవ్వాలన్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని, ఇతర శాఖల సహ కారంతో 60 ఏళ్లు పైబడిన వారందరికీ ఈ వ్యాక్సిన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కలిగించాలని, డ్రై డే పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లా డుతూ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించ వద్దన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, డాక్టర్ పూర్ణేంద్రబాబు, డాక్టర్ బి.ఉమావతి, ఇతర అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

సీఐ హడావిడి

నగరంలో పోస్టింగ్ వేయిస్తానంటున్న అల్లూరి జిల్లా పోలీస్ అధికారి



- ఆయన గాజువాక ట్రాఫిక్ సీఐగా వస్తారట...
- జోన్-2లో తాను చెప్పిన వారికే పోస్టింగ్ ఇస్తారంటూ ప్రచారం చేసుకుంటున్న వైనం
- ఎక్కడ పోస్టింగ్ కావాలో కోరుకోవాలంటూ తన బ్యాచ్‌కు చెందిన వారికి ఆఫర్
- ప్రస్తుతం ఆయా పోస్టుల్లో ఉన్నవారికి కూడా ఫోన్లు... రెండో ఆప్షన్ ఎంచుకోవాలని హుకుం
- నగర పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారిన సదరు సీఐ వ్యవహారశైలి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆయన ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్. ప్రస్తుతం అల్లూరి సీతారామ రాజు జిల్లాలో పనిచేస్తున్నారు. కానీ నగర పోలీస్ కమిషనరేట్‌లోని జోన్-2 పరిధిలో సీఐ, ఎస్ఐల పోస్టింగ్‌లు తన కనుసన్నల్లోనే జరుగుతాయంటూ ప్రచారం చేసుకుంటున్నారు. జోన్-2లో ఒక అధికారి తనకు బాగా సన్నిహితులని, తాను చెప్పిన వారికే పోస్టింగ్‌లు ఇస్తారు కాబట్టి ఎక్కడ కావాలో చెప్పాలంటూ తన బ్యాచ్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలకు ఆఫర్ చేయడంతోపాటు ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న వారిని వేరొకచోటు ఎంపిక చేసుకోవాలని చెప్పడం... పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

నగర పోలీస్ కమిషనరేట్‌లో పోస్టింగ్ కోసం విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఆశావహులు పోలీస్ శాఖలోని ఉన్నతాధికారులతోపాటు ప్రజా ప్రతినిధుల సిఫారసుల కోసం యత్నిస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇంతవరకూ సీఐలు, ఎస్ఐల బదిలీలు జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో ఎవరు ఎక్కడ ఉన్నారో...ఇప్పటికీ అక్కడే కొనసాగుతున్నారు. తాజాగా నగరంలో సీఐలు, ఎస్ఐల బదిలీలు భారీగా జరిగే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న ఒక సీఐ నగరంలో తాను పోస్టింగ్‌లు వేయిస్తానంటూ తన బ్యాచ్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలకు హామీ ఇస్తున్నట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జోన్-2 పరిధిలో పనిచేస్తున్న అధికారి ఒకరు తనకు బాగా సన్నిహితులని తాను చెప్పిన సిఫారసులను ఆయన పరిగణనలోకి తీసుకుంటారని చెప్పుకుంటున్నట్టు పోలీస్ అధికారులు కొందరు తెలిపారు. జోన్-2 పరిధిలో ఎక్కడ పోస్టింగ్ కావాలంటూ తన బ్యాచ్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలను అడుగుతున్నారని, వారు అడిగినచోట పనిచేస్తున్న సీఐలు, ఎస్ఐలకు కూడా ఫోన్ చేసి 'మా మనిషి అక్కడికి వస్తాడు కాబట్టి, మీరు మరొక చోటు ఏదైనా ఎంపిక చేసుకుని ఆప్షన్ ఇవ్వండి' అని చెబుతున్నారని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. తాను గాజువాక ట్రాఫిక్ సీఐగా వస్తానని, జోన్-2లోని అన్ని స్టేషన్ల సీఐలు, కీలక పోస్టుల్లో తన బ్యాచ్‌వారే ఉంటారని అంటున్నట్టు తెలిసింది. అధికారులు, సిబ్బంది పనితీరుపై సీపీ శంఖబ్రతబాగ్చి నిఘా పెట్టడంతోపాటు, ఎవరైనా ఓవరాక్షన్ చేసినా, అవినీతికి పాల్పడినా తక్షణం చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో కూడా ఒక సీఐ స్థాయి అధికారి నగరంలో పోస్టింగ్‌లంటూ హడావుడి చేస్తుండడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సదరు సీఐ వ్యవహారం ఇప్పటికే సీపీ దృష్టికి చేరినట్టు కొందరు అధికారులు చెబుతున్నారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రస్తుతం బదిలీలు ఉండకపోవచ్చునని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

నేడు సామాజిక పింఛన్లు పంపిణీ



- 1,63,210 మందికి రూ.70.05 కోట్లు
- 4,398 మంది సిబ్బంది వినియోగం
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు గురు, శుక్రవారాల్లో పంపిణీ చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో గల 1,63,210 మందికి పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం ఐదు గంటలకు ప్రారంభిస్తామన్నారు. జీవీఎంసీ పరిధిలో 1,36,096 మంది, గ్రామీణ ప్రాంతంలో 27,210 మందికి రూ.70.05 కోట్లు పింఛన్ల కింద అందజేస్తామన్నారు. పింఛన్ల సొమ్ము బుధవారమే బ్యాంకుల నుంచి డ్రా చేసి వార్డు,గ్రామ సచివాలయాల సిబ్బందికి అందజేశామన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి 4,356 మంది సచివాలయ సిబ్బంది, 42 మంది జీవీఎంసీ, ఐసీడీఎస్ సిబ్బంది మొత్తం 4,398 మందిని వినియోగిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ప్రజా ప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొనకూడదని స్పష్టంచేశారు.

కోడ్ ఉండగానే బదిలీలు

పోలీస్ శాఖలో డీఎస్పీల బదిలీ నిలిపివేత

- ఈపీడీసీఎల్‌లో మాత్రం ఎస్ఈలు, డీఈల బదిలీలు
- జీవీఎంసీలో కూడా...

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మంగళవారం షెడ్యూల్ ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రకటన జారీచేస్తూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్టు వివరించారు. ఇదిలావుండగా పోలీస్ శాఖలో డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో ఎక్కడా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించిన బదిలీలు లేవు. నియామకాలు లేవు. కానీ ఏపీఈపీడీసీఎల్‌లో బుధవారం భారీగా బదిలీలు చేపట్టారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు బదిలీలు చేశారు. విశాఖ సర్కిల్ ఎస్ఈగా శ్యాంబాబును నియమించగా, ఆయన రాత్రి ఏడు గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అలాగే జీవీఎంసీలో అదనపు కమిషనర్‌గా డీవీ రమణమూర్తిని నియమించారు. ఆయన సాంఘిక సంక్షేమ శాఖ నుంచి వచ్చారు. డిప్యుటేషన్‌పై గాజువాకలో పనిచేస్తున్న అదనపు కమిషనర్ వి.సన్యాసిరావును మాతృశాఖకు పంపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కొందరు బదిలీలను ఆపగా, మరికొందరు బదిలీలు చేపట్టారు. దీనిపై అధికార వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. దీనిపై కలెక్టర్ కార్యాలయంలో సంప్రతించగా, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందిని బదిలీ చేయకూడదని, ఇతర శాఖలకు ఇది వర్తించదని ఒక అధికారి తెలిపారు. అయితే ఎన్నికల కోడ్ అంటే అన్ని శాఖలకు వర్తిస్తుందని, మినహాయింపు ఏమీ ఉండదని మరో అధికారి వ్యాఖ్యానించారు. దీనిపై ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టరే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

బంగ్లా చుట్టూ కంచె తొలగింపు

20 మంది సిబ్బంది వెనక్కి...

- తన నుంచే ప్రక్షాళన మొదలుపెట్టిన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.సంపత్‌కుమార్ తన కార్యాలయం, బంగ్లా నుంచే ప్రక్షాళన ప్రారంభించారు. గత కమిషనర్ సాయికాంత్‌వర్మ బంగ్లా చుట్టూ 30 అడుగులు ఎత్తున రేకులతో రక్షణ కంచెను ఏర్పాటుచేశారు. దీని వల్ల ఎలాంటి ఉపయోగం లేనప్పటికీ జీవీఎంసీ నిధులను భారీగా వెచ్చించారు. అలాగే బంగ్లాలో పనిచేసేందుకు ఏకంగా 45 మందికిపైగా సిబ్బందిని ఏర్పాటుచేసుకున్నారు. ప్రజల కోసం పనిచేయాల్సిన వారిని తన బంగ్లాలో నియమించుకున్నారు. సాయికాంత్‌వర్మను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయడంతో కొత్త కమిషనర్‌గా పి.సంపత్‌కుమార్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. జీవీఎంసీలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, అధికారులు కూడా తమ వ్యక్తిగత పనుల కోసం సిబ్బందిని భారీగా వినియోగిస్తున్నట్టు గుర్తించారు. ప్రక్షాళన తన నుంచే ప్రారంభిస్తున్నట్టు అధికారులతో జరిగిన మర్యాదపూర్వక భేటీలో చెప్పిన ఆయన...అన్నట్టుగా అందుకు శ్రీకారం చుట్టారు. తన బంగ్లాలో అవసరం లేకపోయినా ఎక్కువమంది సిబ్బంది పనిచేస్తున్నట్టు గుర్తించి 20 మందిని వారి మాతృ విభాగాలకు పంపించేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వారిని వినియోగించుకోవాలని ఆయా విభాగాల అధిపతులను ఆదేశించారు. తాజాగా తన బంగ్లా చుట్టూ ఏర్పాటుచేసిన రక్షణ కంచెను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం నుంచి కంచె తొలగింపు పనులు ప్రారంభించారు.



జీవీఎంసీ కమిషనర్ బంగ్లా చుట్టూ ప్రహరీ గోడపై తొలగించిన రేకులు

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు

ఓటర్లు 822 మంది

- 36 మంది జడ్పీటీసీ సభ్యులు, 636 మంది ఎంపీటీసీ సభ్యులు, 97 మంది జీవీఎంసీ కార్పొరేటర్లు
- నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో 53 మంది కౌన్సిలర్లు
- ఉమ్మడి జిల్లాలో అమలులోకి కోడ్
- కలెక్టర్ల సదస్సుకు హాజరుపై ఈసీకి కలెక్టర్ లేఖ

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, జీవీఎంసీలో కార్పొరేటర్లు, ఎలమంచిలి, నర్సీపట్నం మునిసిపాలిటీల కౌన్సిలర్లు మొత్తం 822 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లాలో 39 జడ్పీటీసీ సభ్యులకుగాను ప్రస్తుతం 36 మంది ఉన్నారు. హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అరకులోయ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో జడ్పీటీసీ సభ్యుని పదవికి రాజీనామా చేశారు. సబ్బవరం, రావికమతం జడ్పీటీసీ సభ్యులు తుంపాల అప్పారావు, తలారి రమణమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందారు. మొత్తం మూడు జడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

కాగా 652 ఎంపీటీసీ స్థానాలకుగాను వివిధ కారణాలతో ప్రస్తుతం 636 మంది, జీవీఎంసీలో 98 కార్పొరేటర్లకుగాను 97 మంది ఉన్నారు. 21వ వార్డు నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ తదనంతరం ఎమ్మెల్సీ కావడంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ఎలమంచిలి మునిసిపాలిటీలో 25 మంది, నర్సీపట్నం మునిసిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేయడంతో ఉమ్మడి జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది.


కలెక్టర్ల సదస్సుకు హాజరుపై ఈసీకి కలెక్టర్ లేఖ

ఆగస్టు ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టర్ల సదస్సుకు హాజరుకావాలా? లేదా?...అన్న దానిపై స్పష్టత కోసం ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ లేఖ రాయనున్నారు. కలెక్టర్ల సదస్సులో జిల్లాల ప్రగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన అంశాలపై నివేదికలు రూపొందించి చర్చిస్తారు. ఎన్నికల కమిషనర్ నుంచి అనుమతి వస్తే ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు ఈ సదస్సుకు హాజరవుతారు. ఇంకా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తుంటారు. సాధారణంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీనిపై కూడా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని నిర్ణయించారు.

ఇసుక రేటును సరిచేశారు

- భీమిలి, అగనంపూడి డిపోల్లో టన్ను రూ.1,076

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న రెండు డిపోల్లో ఇసుక రేటును సరిసమానం చేశారు. తాజా ఆదేశాల మేరకు అగనంపూడి, భీమిలి డిపోల్లో టన్ను రూ.1,076కు విక్రయించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జూలై తొలివారంలో డిపోల వద్ద ఇసుక అమ్మకాలు పునఃప్రారంభించారు. భీమిలి డిపోలో టన్ను ఇసుక రూ.758, అగనంపూడిలో రూ.1,394గా నిర్ణయించారు. భీమిలి డిపోలో రేటు తక్కువగా ఉండడంతో రోజుకు 20 వేల టన్నుల ఇసుక విక్రయించగా, అదే అగనంపూడిలో రేటు ఎక్కువగా ఉండడంతో రోజుకు 200 టన్నుల వరకూ మాత్రమే పోతోంది. ఈ నేపథ్యంలో రెండు డిపోల్లో ఒకే రేటు ఉండేలా చూడాలని అధికారులు నిర్ణయించారు. దీంతో టన్ను రూ.1076గా ఖరారు చేయడంతోపాటు అక్కడ బ్యానరు ఏర్పాటుచేశారు.



భీమిలి ఇసుక డిపోలో ఏర్పాటుచేసిన బ్యానర్

బియ్యం నాణ్యతపై ఆందోళన



సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న జేసీ

30 శాతం మంది పిల్లలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినడం లేదన్న ప్రధానోపాధ్యాయులు

- ఫోర్టి ఫీడ్ (బలమైన) బియ్యం సరఫరా చేస్తున్నామన్న పౌర సరఫరాల అధికారులు
- ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్న జాయింట్ కలెక్టర్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం కోసం సరఫరా చేస్తున్న బియ్యంలో నాణ్యత ఉండడం లేదని ప్రధానోపాధ్యాయులు, వంట ఏజెన్సీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పౌర సరఫరాల శాఖ, విద్యా శాఖ, ఐసీడీఎస్, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం కోసం పౌర సరఫరాల సంస్థ సరఫరా చేసే బియ్యం నాణ్యతపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందు ఈ సమావేశం నిర్వహించారు. పలువురు హెచ్ఎంలు, వంట నిర్వాహకులు మాట్లాడుతూ బియ్యంలో సగం వరకు నూకలు ఉంటున్నాయని, ఇంకా రాళ్లు, అక్కడక్కడా పురుగులు దర్శనమిస్తున్నాయన్నారు. వంట చేసే సమయంలో నూకలు ముందుగా ఉడికిపోతాయని, బియ్యం ఉడకడానికి కొంత సమయం పడుతుందని పేర్కొంటూ...దీనివల్ల నూకలు మెత్తగా ఉండ కడుతున్నాయని వివరించారు. బియ్యం ... మిగతా 6వ పేజీలో

బయో టాయిలెట్లపై అవగాహన పెంచాలి: కలెక్టర్

మహారాణిపేట, జూలై 31: బయో టాయిలెట్ల వినియోగంపై అందరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సఫాయి కర్మచారి వ్యవస్థపై వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టాయిలెట్లను కార్మికులు స్వయంగా క్లీన్ చేసే పద్ధతి కాకుండా ఆధునిక విధానాలు అనుసరించాలన్నారు. కార్మికుల అవసరాలు, సమస్యలు , జీవనోపాధి తదితర అంశాలపై చర్చించారు. పారిశుధ్య కార్మికులకు ఐడీకార్డులు, బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పనిచేసేచోట అన్ని భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు. బహిరంగ మల విసర్జన నష్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్, అధికారులు పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభించేదెన్నడో?

» నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా... అందుబాటులోకి రాని వైనం

మాధవధార, జూలై 31; గ్రేటర్ 51వవార్డు మాధవధారలో సార్వత్రిక ఎన్నికల కోడ్ నిబంధనలనుంచి యంత్రాంగం బయటకురాలేదు. ఇంకా, పలుచోట్ల శిలాఫలకాలపై ముసుగులు అలానే ఉంచేశారు. జూన్ 4న ఫలితాలు వెలువడిన తర్వాత, జూన్ 6వ తేదీతో ఎన్నికల కోడ్ ముగిసింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. కానీ, ఎన్నికల కోడ్ వెలువడిన గత మార్చి 28 తేదీనుంచి కప్పి ఉంచిన పరదాలు నేటికీ పలుచోట్ల తీయలేదు. ఇప్పటి నాలుగు నెలలు గడిచాయి. అలాగే, వార్డులో కళావేదికను గత ఫిబ్రవరిలోనే ఆదరాబాదరాగా వైసీపీ నాయకుడు కేకే రాజు, డిప్యూటీ మేయర్ జె. శ్రీధర్‌తదితరులు ప్రారంభించారు. కానీ, ఇప్పటి వరకు ఓ శుభకార్యం కానీ, సమావేశం కానీ, ఈ వేదికవద్ద నిర్వహించిన దాఖలాల్లేవు. దాదాపు రూ. 30 లక్షల నిధులతో పరిసరాల్లోని పచ్చదనాన్ని, గ్రీన్ బెల్ట్ లాంటి ఏరియాని పూర్తిగా నామరూపాల్లేకుండా చేసి ఈ కళావేదికను ఎంతో అట్టహాసంగా పూర్తి చేశారు. తీరా, ఎన్నికలు పూర్తయి నెలలు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీని ఎదుట శిలాఫలకంపై ముసుగును కనీసం తొలగించాలన్న ఆలోచన చేయలేదు. ఇకనైనా కళావేదిక వినియోగంలోకి తీసుకురావాలని వార్డు నివాసితులు, అంబేడ్కర్ కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



తొలగించని శిలా ఫలకంపై ముసుగు


నిరుపయోగంగా ఉన్న కళావేదిక

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

» జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ


హెల్మెట్ అందజేస్తున్న వెంకట శేషమ్మ

డాబాగార్డెన్స్, జూలై 31: ద్విచక్ర వాహనం నడిపేవారితోపాటు, వెనుక కూర్చునే వారూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ తెలిపారు. హెల్మెట్ల వినియోగంపై బుధవారం ఎల్ఐసీ బిల్డింగ్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అనంతరం ఎస్‌బీఐ జిల్లా కోర్టు శాఖ, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎల్ఐసీ శాఖ కార్పొరేట్ , సామాజిక బాధ్యతలో భాగంగా సమకూర్చిన హెల్మెట్లను పలువురికి ఉచితంగా అందించారు.

రూపుదిద్దుకుంటున్న అన్న క్యాంటీన్


టర్నర్ చౌల్ట్రీవద్ద భవనం మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

జగదాంబ కూడలి, జూలై 31: టర్నర్ చౌల్ట్రీ వద్దనున్న అన్న క్యాంటీన్ సరికొత్తగా రూపుదిద్దుకుంటోంది. ఐదేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం తొలగించిన ఈ క్యాంటీన్‌ను ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తిరిగి దీనిని ఏర్పాటు చేసేందుకు జీవీఎంసీ సన్నద్ధమవుతోంది. అన్న క్యాంటీన్ భవనాన్ని మరమ్మతులు చేపడుతున్నారు. లోపల వసతులు కల్పిస్తున్నారు. వన్‌టౌన్‌లో పేదలతోపాటు ఆటో రిక్షా కార్మికులు, షాపుల్లో పనిచేసే చిరుద్యోగులకు అన్న క్యాంటీన్ ఆసరాగా నిలవనుంది.ఆగస్టు 15 తేదీన ప్రారంభం కానున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

వచన కవిత్వంలో తిలక్‌ది అసమాన ప్రతిభ



సమావేశంలో మాట్లాడుతున్న రాంభట్ల నృసింహ శర్మ.

సీతంపేట, జూలై 31: ప్రముఖ కవి బాలగంగాధర తిలక్ తెలుగు వచన కవితా ప్రక్రియను తన అసమాన ప్రతిభతో ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లారని సాహితీవేత్తలు కొనియాడారు. బాలగంగాధర తిలక్ 103వ జయంతిని పురస్కరించుకుని సృహదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో తిలక్ కవిత్వంపై ప్రముఖ సాహితీవేత్త, భారతీ భూషణ రాంభట్ల నృసింహ శర్మ ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతిచెందిన ప్రముఖ కవయిత్రి కన్నేల్లి వరలక్ష్మికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సహృదయ సాహితి అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షోపన్యాసం చేశారు. రాంభట్ల నృసింహ శర్మ మాట్లాడుతూ అగ్ని, అమృతం సమపాళ్లలో ఉండేలా తిలక్ రచించారన్నారు. ఆయన కవిత్వంలో భావుకతకు అద్దంపట్టారన్నారు. డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడుతూ తిలక్ భావ కవిత్వం, అభ్యుదయంను తనదైన శైలిలో వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా సూరపనేని విజయకుమార్, సంస్థ కార్యదర్శి చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కేవీఎస్ మూర్తి, కొండేపూడి సర్వేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి ప్రైవేటు పాఠశాలల సమస్యలు


మంత్రి సుభాశ్‌కు వినతి పత్రమిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మహారాణిపేట, జూలై 31: ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాశ్‌ను అసోసియేషన్ ప్రతినిధులుకోరారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన మంత్రి నిహోటల్ నోవాటెల్‌లో బుధవారం కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్ , సహాయ కార్యదర్శి శీలం, వీఎస్ఎన్ మూర్తి, జిల్లా అధ్యక్షుడు కె. రామకృష్ణ, డీవీ శ్రీనివాస్, బీ శ్రీనివాస్, గోవింద్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలకు ప్రణాళిక

సీతంపేట, జూలై 31: డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలకు కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 200 పాఠశాలల్లో నియమించిన 51,954 పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ లేదా అసిస్టెంట్లతో కంటి పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. గతంలోపరీక్షలుచేసిన 3557మందికికళ్లద్దాలను ఉచితంగాఅందిస్తామన్నారు.

రహదారి మధ్య వ్యర్థాల తొలగింపులో అలసత్వం

» మర్రిపాలెం- ఆర్‌అండ్‌బీ జంక్షన్ దారిలో రాకపోకలకు అవస్థలు

మర్రిపాలెం, జూలై 31: ఇటీవల కురిసిన వర్షాలకు 53వ వార్డు పరిధి మర్రిపాలెం, ఆర్‌అండ్‌బీ జంక్షన్‌దరి శ్రీరామ్‌నగర్ కాలనీలో భారీ వృక్షం రహదారి మధ్యలో కూలిపోయిన విషయం తెలిసిందే. సంబంధిత అధికారులు, సిబ్బంది చెట్టును పూర్తిగా తొలగించకుండా వదిలి వేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదం జరిగిన రోజు చెట్టు మొదలు యంత్రాలతో కట్‌చేసి, కొమ్మలను తొలగించకుండా వదిలివేశారు. దీంతో ప్రస్తుతం చెట్టు వేరుభాగం, కొమ్మలు రోడ్డంతా విస్తరించి చెల్లాచెదురుగా అధ్వానంగా మారాయి. ఇప్పటికైనాఅధికారులుస్పందించి చెట్టు పూర్తిస్థాయిలో తొలగించాలని పలువురు కోరుతున్నారు.


వదిలేసిన చెట్టు మొదలు


రోడ్డుపై వచ్చిన కొమ్మలు, వ్యర్థాలు

ధ్వంసమైన డివైడర్..

» పట్టించుకోని యంత్రాంగం


పైడిమాంబ ఆలయం వద్ద చిందరవందరగా మారిన డివైడరు

మురళీనగర్, జూలై 31 ; నగర సోయగాలు ఎప్పటికపుడు మెరుగులు దిద్దుతూ జీవీఎంసీ కొత్తగా నిర్మాణాలు జరపడం... అవి రోజుల వ్యవధిలోనే నామరూపాల్లేకుండా పోవడం సర్వసాధారణంగా మారింది. ఈ క్రమంలో 51వ వార్డులోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ రామన్నకాలనీ వద్ద పైడిమాంబ కాలనీ వద్ద భారీ హోర్డింగ్‌ల ప్రాంతం వద్ద ఇటీవల కొత్తగా డివైడర్లు నిర్మించి రంగులు వేశారు. వాటిపై భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేసిన నాయకులకు గత వైసీపీ పెద్దలు అనుమతులు కూడా మంజూరు చేశారు. అయితే, జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ అమ్మవారి గుడి ఎదుట తీర్చిదిద్దిన డివైడరు ఇటీవల రాత్రి వేళలో గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొనడంతో నేలకొరిగింది. అలాగే, ఇనుప స్తంభాల్లో ఒకటి నేలకొరిగింది. రహదారికి ఆనుకొని ఉన్న ఈ డివైడరు విరిగిపోయింది. రాళ్లు, మట్టి హైవే సర్వీసు రోడ్డులోనే పరుచుకోవడంతో రాకపోకలకు అంతరాయంగా మారింది. అయినా, స్థానిక 287 సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ విభాగం కనీసం పర్యవేక్షించపోవడం గమనార్హం. ఈ రోడ్డులో ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారంలేదని సచివాలయ, టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. వీరితోపాటు సమీపాన ఉన్న ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులకు విషయం తెలియలేదు. ప్రజాధనంతో కట్టిన డివైడర్‌కు నష్టం వాటిల్లడంతోపాటు అటుగా ప్రయాణించే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

3న 'తుపాకీ సంస్కృతి'పై సదస్సు

సీతమ్మధార, జూలై 31: 'ప్రపంచ వ్యాప్తంగా పెచ్చుమీరుతున్న తుపాకీ సంస్కృతిపై అనే అంశంపై ఈ నెల 3వ తేదీన ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో సదస్సును నిర్వహిస్తున్నట్టు గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి. బాలమోహన్‌దాస్ తెలిపారు. బుల్లయ్య కళాశాలలో బుధవారం ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. శనివారం ఉదయం 10 గంటలకు గాంధీ సెంటర్‌లో జరిగే ఈ సదస్సులో ప్రపంచ శాంతి కోరే మేధావులు, సామాజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొనాలన్నారు. వివరాలకు ఫోన్: 90324 77463 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, కృష్ణా యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య రామకృష్ణ, డాక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి, అబ్దుల్ మునీర్ ముషాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 31: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అబిద్‌నగర్, షాదీఖానా, రామచంద్రనగర్, ఎంటీసీ పాలెం, బైబిల్‌హౌస్, విద్యుత్‌నగర్ వినియోగదారులు గమనించాలన్నారు.

మాధవధార; తెన్నేటినగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. మాధవధార బస్టాపు ప్రాంతం, గ్యాస్ గొడౌన్ జంక్షన్, తెన్నేటినగర్ వాసులు గమనించాలని కోరారు. అలాగే, మాధవస్వామి టెంపుల్ రోడ్, కళింగనగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోర్టు కాలుష్యం సమస్య పరిష్కరించాలి

» ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, జూలై 31: పోర్టు కాలుష్యం సమస్య పరిష్కరించాలని దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. పోర్టు ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు కాలుష్యంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి తాను దక్షిణ నియోజకవర్గంలో పర్యటిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎస్ఆర్ కాలువ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, వెంటనే ఆ పరిసరాలను శుభ్రం చేయాలని కోరారు. దోమలు వ్యాప్తితో పరిసర ప్రాంతాల ప్రజలు కంటిమీద కునుకు లేకుండా ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పోర్టు కాలుష్యంతో నియోజకవర్గంలోని ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోర్టు అధికారులు వేణుగోపాల్, శ్రీరామచంద్రమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

సీతమ్మధార, జూలై 31: గ్రేటర్ 23వ వార్డు నక్కవానిపాలెం చైతన్యనగర్ కనకమ్మవారి వీధి, తదితర ప్రాంతాల్లో జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు శీరపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదును మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. పార్టీ అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశానుసారం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఉమా మమేష్, నరసింగరావు రెడ్డి, డివి రంగారెడ్డి, రమణ, పిల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్య ఎంతో విలువైనది


వాహనాల తనిఖీల్లో ఆర్టీఏ అధికారులు

డాబాగార్డెన్స్, జూలై 31: పాఠశాల విద్య ఎంతో విలువైనదని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు ప్రభాకర్ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని ఆర్‌బీఎంయుపీ పాఠశాలలో శిక్ష సప్తాహ్ శుభతిథి భోజన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ నార్త్‌ఈస్ట్ సభ్యులు సహకారం అందజేశారు. ఈ సందర్భంగా , ప్రాథమిక దశలో బాగా చదువుకోవడం ద్వారా భవిష్యత్తులో రాణించేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల బాగుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌నార్త్‌ఈస్ట్ ప్రెసిడెంట్, సెక్రటరీలు కృష్ణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్, జూలై 31: ఆయుర్వేద పంచకర్మ విధానంపై ఆగస్టు 3 నుంచి 6 వరకుఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు కె.ఎం.ఉన్నికృష్ణన్ నాయర్ నాలుగురోజులపాటుకేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆందోళన, మానసిక ఒత్తిడి, నిద్రలేమీ తదితర సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో సేవలందిస్తారన్నారు. వివరాలకు ఫోన్ 76758 61446లో సంప్రదించవచ్చునన్నారు.

4న భువనేశ్వరి ఆదివాస మహోత్సవం

డాబాగార్డెన్స్, జూలై 31: యాతపాలెంలోని శ్రీభువనేశ్వరి అమ్మవారి ఆదివాస మహోత్సవాన్ని ఆగస్టు 4న ఘనంగా నిర్వహిస్తున్నట్టు భువనేశ్వరి పీఠంఅధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు.ఆ రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

వాహనాలపై 63 కేసులు


వాహనాల తనిఖీల్లో ఆర్టీఏ అధికారులు

మురళీనగర్, జూలై 31 ; విశాఖపట్నం ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం పరిధిలో బుధవారం వాహనాల ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లపై తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 63 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఎన్ఏడీ, హనుమంతవాక, విమ్స్ హాస్పిటల్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. వాహన యజమానులకు హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లపై అవగాహన కల్పించినట్టు ఎంవీఐ గణేష్ రెడ్డి, మాధవి, ఏఎంవీఐలు దుర్గాప్రసాద్, శిరీష ఈసందర్భంగా తెలిపారు. రహదారి నిబంధనలు పక్కా గా అమలులో భాగంగా తనిఖీలు ముమ్మరం చేసినట్టు టీటీసీ జిసి.రాజారత్నం తెలిపారు. వాహనదారులు లైసెన్స్ సమీపంలో ఉంచాలన్నారు. మద్యం సేవించి వాహనాలను డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి'

మహారాణిపేట, జూలై 31: విశాఖ జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. బుధవారం కలెక్టరేటర్‌లో కలెక్టర్‌ను జర్నలిస్టు ప్రతినిధులుకలసి సమస్యలను విన్నవించారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న జర్న లిస్టుల పిల్లలకు గతంలో మాదిరిగా 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌కు చెల్లించాల్సిన ప్రీమియంను సీఎస్ఆర్ నిధుల నుంచి చెల్లింపునకు సహకరించాలన్నారు. జర్నలిస్టు ప్రతినిధులు పి. సత్యనారాయణ, కె. రాము, ఆర్. రామచంద్రరావు, చంద్రమోహన్, డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వయనాడ్, నాడు కోడిపుంజువలస...

... 5వ పేజీ తరువాయి

కొట్టుకుపోయాయి. బండరాళ్లు దొర్లుకొస్తున్నా ఈదురుగాలుల వల్ల ఆ శబ్దం తమకు వినిపించలేదని అప్పట్లో బాధితులు తెలిపారు. 70కి పైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. అప్పటి ప్రభుత్వం స్పందించి ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసి వసతులు కల్పించింది. మృతుల కుటుంబానికి రూ.2.5 లక్షల చొప్పున పరిహారం అందజేసింది. ప్రతి కుటుంబానికి జీవనోపాధి కోసం జత దుక్కిటెడ్లు, నివాసం కోసం మోడల్ కాలనీని మంజూరుచేశారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి సహాయాన్ని అందించాయి. అదే తరహాలో 2014 అక్టోబరు 8వ తేదీన హుద్‌హుద్ తుఫాన్ వల్ల మాదల పంచాయతీ మేదరశాల గ్రామంపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు సజీవ సమాధి అయ్యారు. వరద వల్ల మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొండలను ఆనుకుని చాలా గ్రామాలు ఉన్నాయి. కోడిపుంజువలస ఘటన అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పాలకులు భావించినా చాలామంది సుముఖత చూపలేదు. వయనాడ్ ఉదంతం నేపథ్యంలో జిల్లా అధికారులు కొండవాలు గ్రామాల్లో ఉంటున్న వారి రక్షణపై దృష్టి పెట్టాల్సి ఉంది.

బియ్యం నాణ్యతపై ఆందోళన

... 5వ పేజీ తరువాయి

నాణ్యత లేకపోవడంతో 30 శాతానికిపైగా పిల్లలు పాఠశాలల్లో భోజనం చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా ఒక పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ 1,500 మంది పిల్లలు తమ స్కూలులో గుడ్డు తినేందుకు ముందుకు వస్తున్నారు తప్ప మొత్తం అందరూ భోజనం చేయడం లేదన్నారు. గట్టిగా అడిగితే అన్నం తింటే కడుపు నొక్కుతుందని అంటున్నారని, దీంతో తల్లిదండ్రులు కూడా తమను నిలదీస్తున్నారని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే పౌర సరఫరాల సంస్థ అధికారులు వివరణ ఇస్తూ ఫోర్టి ఫీడ్ (బలమైన) బియ్యం సరఫరా చేస్తున్నామని, 20 శాతం వరకు నూకలు ఉంటాయని చెప్పుకొచ్చారు. హెచ్‌ఎంలు, నిర్వాహకులు స్పందిస్తూ పిల్లలకు భోజనం తయారీ కోసం నాణ్యమైన బియ్యం ఇవ్వాలని కోరారు. దీనిపై జేసీ స్పందిస్తూ సమావేశంలో వచ్చిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు, నోడల్ ఏజెన్సీలకు సరకులు సకాలంలో అందించాలన్నారు. రేషన్ డిపోల ద్వారా అందించే బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గూన సూర్యప్రకాశరావు, డీఈవో ఎల్.చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, ఐసీడీఎస్ పీవో జయదేవి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షీలానగర్‌లో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని 'పల్లా'కు వినతి

అక్కిరెడ్డిపాలెం, జూలై 31: షీలానగర్‌లో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ 69వ వార్డు నాయకులు వినతిపత్రం అందజేశారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో పల్లాను 69వ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు ఆధ్వర్యంలో షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, హరిజన జగ్గయ్యపాలేనికి చెందిన నాయకులు కలిసి అన్న క్యాంటీన్ ఏర్పాటుతో పాటు స్థానిక సమస్యలను వివరించారు. షీలానగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, డెయిరీ ఆస్పత్రి ఉండడంతో పాటు త్వరలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రారంభం కానున్నందున ఇక్కడ అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో హరిజన జగ్గయ్యపాలెంలో కల్యాణ మండపాన్ని అబివృద్ధి చేయాలని, ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలన్నారు. వెంకటేశ్వర కాలనీ, షీలానగర్ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలను నిర్మించాలనిన్నారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు ఎం.ఆనంద్,కె.రామకృష్ణ, ఎ.చౌదరి, దావీదు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గోపాలపట్నం, జూలై 31: ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, డీఏఆర్ నగర్, సంతోశ్ నగర్, భగత్‌సింగ్ నగర్, ఎల్లపువానిపాలెం, చంద్ర నగర్, పాత గోపాలపట్నం, రైల్వే స్టేషన్ రోడ్డు, నేతాజీ వీధి, గోపాపలట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడికి న్యాయం చేయాలి

అగనంపూడి, జూలై 31: స్టీల్‌ప్లాంటులో పనిచేస్తూ విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు గొల్లవిల్లి సన్యాసిరావుకు న్యాయం చేయాలని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలను పాటించకుండా కాంట్రాక్టర్ కార్మికులతో పనులు చేయిస్తుండడం వల్లే ప్రమాదం జరిగి సన్యాసిరావుకు రెండు కాళ్లు దెబ్బతిన్నాయన్నారు. గాయపడిన కార్మికుడిని సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, దీనిపై కార్మాగార భద్రతా తనిఖీ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఉక్కు యాజమాన్యం స్పందించి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఇదిలావుండగా సర్వహిత చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరరావు, లక్కరాజు రాము, శీరంశెట్టి గోవిందరావు, తదితరులు సన్యాసిరావును పరామర్శించి నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు.

పాస్టర్ల నూతన కార్యవర్గం

పెందుర్తి, జూలై 31: మండల పరిధిలోని పాస్టర్స్, చర్చిల నూతన కార్యవర్గాన్ని చినముషిడివాడలోని గోస్పల్ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో బుధవారం ఎన్నుకున్నారు. డాక్టర్ రెవరెండ్ పి.పాల్‌రాజ్ ఎన్నికల ఛైర్మన్‌గా వ్యవహరించగా, డాక్టర్ వరప్రసాద్ పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సొసైటీ అధ్యక్షునిగా పాస్టర్ బోయిన జాషువా,ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ డి.కాంతారావు, ట్రెజరర్‌గా పాస్టర్ బొట్టా జాషువా, ఉపాధ్యక్షునిగా పాస్టర్ డి.స్టీవెన్, సంయుక్త కార్యదర్శిగా పాస్టర్ నీహెచ్ జాన్ రత్నం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎ.పాల్, సభ్యులుగా పాస్టర్లు కాలేబు,కృపాకాల్, హషబ్య ఎన్నికయ్యారు.

హ్యూమన్ రైట్స్ మహిళా కమిటీ ఏర్పాటు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 31: ఎన్ఏడీ కూడలిలోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియాకు సంబంధించిన రాష్ట్ర నూతన మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షురాలుగా పి.శ్రీదేవి వర్మ, కార్యదర్శిగా ఎస్.పద్మారాణి, సంయుక్త కార్యదర్శిగా ఎం.సత్యవతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.మణితో పాటు పలువురు సభ్యులు నియమితులయ్యారు. జాతీయ కన్వీనర్ బీఎస్ కృష్ణ ఆధ్వర్యంలో వీరికి నియామక పత్రాలు అందజేశారు.

సినిమా గైడ్

- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 32, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 26, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 38, అరటికాయ (పెద్దది)6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 64, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 42, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడుచిక్కుడు 78, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	82
ఫారం ధర	--	102
విత్ స్కిన్	--	174
స్కిన్‌లెస్	--	184

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



దారుణంగా ఉన్న కొత్తపాలెం-వెంకటాపురం గ్రామాలను కలిపే రోడ్డు



వర్షాలతో బురదమయంగా మారిన ఐదు మదాల మార్గం

ఆ గ్రామాల మధ్య ప్రయాణం నరకయాతన

- దుర్భరంగా మారిన కొత్తపాలెం-వెంకటాపురం రోడ్డు
- దశాబ్దాలు గడుస్తున్నా నిర్మాణానికి నోచుకోని వైనం
- రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

గోపాలపట్నం, జూలై 31: సుమారు 50 వేల జనాభా ఉన్న రెండు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రహదారి దుర్భరంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతనకు గురవుతున్నారు. ఏళ్లు గుడుస్తున్న ఈ రోడ్డు ఆధునీకారణకు నోచుకోకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ 89వ వార్డు పరిధి కొత్తపాలెం, 92వ వార్డు వెంకటాపురం గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు గ్రామాలకు కలిపే మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో గల ఐదు మదుములతో మార్గం అనువుగా ఉండడంతో గతంలో ఈ గ్రామాలకు భారీ వాహనాలు రాకపోకలు సాగించేవి. అయితే కాలక్రమేణా అండర్ పాస్‌వేలకు మరమ్మతుల్లో భాగంగా రైల్వే శాఖ అధికారులు ఈ రహదారిలో మదుముల ఎత్తు తగ్గించడంతో భారీ వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అయినప్పటికీ మినీ వ్యాన్‌లు, ఆటోలు తదితర వాహనాల ద్వారా జనాలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ రహదారి దుర్భరంగా మారింది. ఐదు మదుముల మార్గంలో రైల్వే సమస్య కారణంగా రహదారి నిర్మాణానికి నోచుకోవడం లేదు. దీంతో సాధారణ రోజుల్లో ఏదోవిధంగా జనాలు రాకపోకలు సాగిస్తున్నా. వర్షాల కురిసే మాత్రం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మదుముల మార్గంలో కాలినడకన కూడా రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా ఉంటుంది. ఇక్కడ మొత్తం బురద పేరుకుపోవడంతో నడిచేందుకు కూడా అవకాశం లేదు. ఆ సమయంలో వెంకటాపురంలో ఎవరైనా చనిపోతే రైలు పట్టాల మీద నుంచి మృతదేహాన్ని శ్మశానానికి తీసుకువెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఈ రెండు గ్రామాల మధ్య రహదారి నిర్మాణం చేపడితే వేలాది మంది ప్రజలు ఎంతో మేలు జరుగుతుంది. దశాబ్దాల కాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఈ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వాన రహదారితో గవరపాలెం కాలనీవాసుల అవస్థలు

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం గవరపాలెం కాలనీలోని ప్రధాన అనుసంధాన రహదారి నుంచి నూకాంబిక ఆలయానికి వెళ్లే మార్గం అధ్వానంగా మారడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆలయానికి వెళ్లే మార్గానికి ఇరువైపులా సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరి నివాసాలకు రాకపోకలు చేపట్టేందుకు వీలుగా పక్కా రహదారి లేదు. మట్టి రోడ్డు మాత్రమే ఉంది. దీంతో ఏ మాత్రం వర్షం కురిసినా ఈ మట్టిరోడ్డు మొత్తం బురదమయమవుతోంది. ఈ నేపథ్యంలో స్థానికులు చందాలు వేసుకుని క్రషర్ తెప్పించి రోడ్డుపై వేసి రాకపోకలు సాగిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి తాము రాకపోకలు సాగించేందుకు వీలుగా పక్కా రోడ్డును నిర్మించాలని వారు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న గవరపాలెం రహదారి

రక్తదానానికి యువత ముందుకు రావాలి

సౌత్ ఏసీపీ టి.త్రినాథ్

గాజువాక, జూలై 31: రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ అన్నారు. గాజువాకలో వెంకీ బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం రక్తం అందక చాలామంది అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారని, రక్తం అందక ఏ ఒక్క ప్రాణం పోకూడదన్నారు. అందువల్ల ఆరోగ్యవంతమైన యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణ దానం చేసిన వారవుతామన్నారు. కాగా అధిక సంఖ్యలో యువత శిబిరానికి విచ్చేసి రక్తదానం చేశారు. కార్యక్రమంలో గాజువాక సీఐ శ్రీనివాసరావు, ప్రతినిధులు టి.వెంకటేశ్, ఉరుకూటి చైతన్య, మోహన్, సాయి, సతీశ్, జోగినాయుడు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

అధ్వానంగా నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీలు

- పూర్తిగా పాడైపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న మురుగు నీరు
- తీవ్ర దుర్వాసన, దోమల విజృంభణ
- జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

పెదగంట్యాడ, జూలై 31: పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో ఉన్న పలు డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. దశాబ్దాలు గడిచినా ఇవి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ కాలనీల నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు ప్రధాన డ్రైనేజీలో చేరడం.. అక్కడ నుంచి గంగవరం పోర్టు బ్రిడ్జి సమీపంలోని గెడ్డలో కలుస్తుంది. గాజువాక, వుడా కాలనీ, రామచంద్రా నగర్, రిక్షా కాలనీ నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ మీదగా పోర్టు బ్రిడ్జి దిగువనున్న ప్రధాన కాలువ అంతా ఓపెన్‌గానే ఉంది. ఈ కాలువకు ఇరుపక్కలా ఉండాల్సిన గట్లు లేవు. దయాళ్ నగర్, సిద్ధేశ్వరం, దుర్గవానిపాలెం, నెల్లిముక్కు, పెదగంట్యాడ మార్కెట్ నుంచి నీలాపుదొడ్డి ప్రాంతాల మీదగా పోర్టు బ్రిడ్జి దిగువ వరకు ఉన్న మెయిన్ డ్రైనేజీ కూడా ఇదే దుస్థితిలో ఉంది. వివిధ కాలనీల నుంచి వచ్చే వాడుక నీరు, వర్షాల సమయంలో వచ్చే నీరు ఈ మెయిన్ డ్రైనేజీలలో కలుస్తుంది. ప్రధానమైన ఈ రెండు మెయిన్ డ్రైనేజీల నుంచి నీరు పోర్టు బ్రిడ్జి దిగువన గల గెడ్డలో కలుస్తుంది. అయితే ప్రధానమైన ఈ కాలువలకు సిమెంటు కాంక్రీట్ గట్లు లేకపోవడం వల్ల వర్షాల సమయంలో నీటి వేగం ఉధృతికి ఇరుపక్కలా ఉన్న మట్టి డ్రైనేజీలలోకి వచ్చేస్తుంది. కాలువల్లో మట్టి పేరుకుపోయి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు దిగువకు సజావుగా పారడం లేదు. దీంతో చెత్తాచెదారం, పూడిక పెద్దఎత్తున నిలిచిపోయి తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రెండు ప్రధాన డ్రైనేజీలకు ఇరువైపులా సిమెంటు గట్లు ఏర్పాటు చేయడంతో పాటు మురుగు నీరు దిగువకు సజావుగా పారేలా జీవీఎంసీ అధికారులకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రిటెయినింగ్ వాల్స్ లేని నీలాపుదొడ్డి ప్రధాన డ్రైనేజీ



హెచ్‌బీ కాలనీలో పాడైపోయిన మురుగు కాలువ

స్టీల్‌ప్లాంటుకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు ఆగవు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్

కూర్మన్నపాలెం, జూలై 31: స్టీల్‌ప్లాంటుకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటాలు ఆగవని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,266వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. వర్కింగ్ క్యాపిటల్ లేక ముడిసరకు కొనుగోలు చేయలేక ఉక్కు ఉత్పత్తి పూర్తిగా అడుగంటిపోవడంతో కార్మికులంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ఉక్కు మంత్రి ఇచ్చిన హామీ మేరకు ముడిసరకును సరఫరా చేయాలన్నారు. ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్‌లో ఉత్పత్తికి విఘాతం కలిగిస్తూ, నష్టాల బారినపడేలా చేస్తున్న వారికి తగిన బుద్ధి చెబుతామన్నారు. ప్రభుత్వ రంగాలకు నష్టం వాటిల్లితే సమాజం ఆర్థికంగా ప్రమాదాల బారిన పడుతుందన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తక్షణమే సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

'అంకితభావంతో పని చేస్తే ఉద్యోగులకు గుర్తింపు'

గోపాలపట్నం, జూలై 31: అంకితభావంతో పని చేసే ఉద్యోగులందరికీ గుర్తింపు లభిస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఇక్కడి లక్ష్మీనగర్‌లోని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.వరలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమాన్ని బుధవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులేదనన్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. అనంతరం వరలక్ష్మి దంపతుల్ని ఘనంగా సత్కరించారు. అలాగ వైసీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు వరలక్ష్మి దంపతులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ఆషాఢ ఏకాదశి పూజలు

కూర్మన్నపాలెం, జూలై 31: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లోని శ్రీకృష్ణ ఆలయంలో, 86వ వార్డు రాజులపాలెంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, 88వ వార్డు గ్రీన్ సిటీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి బుధవారం ఆషాఢ మాస ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు పంచామృతాభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఆయా ఆలయాలకు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌బీఐఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని వేంకటేశ్వర స్వామిని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు సామూహిక గీతా పారాయణం చేశారు. కాగా శ్రీవారి యజ్ఞోపవేతం తయారీ నిమిత్తం ఎస్ఆర్ గార్డెన్స్‌కు చెందిన భక్తులు ఫణిశర్మ, వెంకటనాగరాజు, లక్ష్మీనారాయణమూర్తిలు రూ.లక్షా 35 వేలను ప్రధాన అర్చకులకు అందజేశారు.



రావులపాలెంలో పూజలందుకున్న శ్రీవారు

అగనంపూడి డిపోలో ఇసుక ధర తగ్గింపు

అగనంపూడి, జూలై 31: ఇక్కడి ప్రభుత్వ ఇసుక డిపోలో టన్ను ఇసుక ధరను రూ.1,076 తగ్గిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ ఉత్తర్వులు జారీ చేశారు. లోడింగ్, అన్‌లోడింగ్, ట్రాన్స్‌పోర్టు నిమిత్తం ఇక్కడి డిపోలో టన్ను ఇసుక ధర రూ.1,394గా నిర్ణయించారు. అయితే ధర అధికంగా ఉందని స్థానిక భవన నిర్మాణదారులు ఇక్కడ నుంచి ఇసుకను తీసుకువెళ్లేందుకు మొగ్గు చూపలేదు. ఈ విషయాన్ని స్థానికులు, కూటమి నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందించి జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడడంతో రేటు తగ్గిస్తూ టన్ను ఇసుక ధరను రూ.1076గా నిర్ణయించారు. గతంలో కన్నా టన్నుకు రూ.318 తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల భవన నిర్మాణదారులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు

మల్కాపురం, జూలై 31: సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. కొత్త నక్కవానిపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం ఏర్పాటు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వపరంగా విలేకరులకు అన్ని విధాల సహకారం అందుతుందన్నారు. వైద్య సదుపాయంతో పాటు విలేకరుల పిల్లలకు ఉచిత విద్య, స్థలాల కేటాయింపు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించందని పేర్కొన్నారు. అనంతరం గణబాబును విలేకరులు సత్కరించారు. విలేకరుల సమస్యలపై, ప్రజా సమస్యలపై వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో మల్కాపురం సీఐ విద్యాసాగర్, రెవెన్యూ, విద్యుత్ శాఖ, జీవీఎంసీ అధికారులతో పాటు పలువురు కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న కోరమాండల్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను విలేకరుల సంఘం ప్రతినిధులు సత్కరించారు.

నూతన కార్యవర్గం

పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం గౌరవ అధ్యక్షునిగా సుంకర చలపతిరావు, అధ్యక్షునిగా ఎంవీ గిరి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు, కోశాధికారిగా ఎల్.రాజు, ఉపాధ్యక్షునిగా గుప్తా, సహాయ కార్యదర్శిగా పైడిరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రమేశ్‌తో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

యోగా పోటీల్లో గాజువాక సభ్యులకు పతకాలు



యోగాలో పతకాలు సాధించిన సభ్యులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 31: విశాఖ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నగరంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో గాజువాక విశ్వశాంతి యోగా సత్సంగం సభ్యులు పాల్గొని పతకాలు సాధించారు. వీరిని యోగా గురువు కొల్లి ఈశ్వరరావు బుధవారం గాజువాకలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల శారీరక, మానసిక ఉత్సాహం కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ యోగా సాధన చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. శరీరం,మనసును ఏకం చేసే ప్రక్రియ యోగా సాధన ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎన్.బాబూరావు, జి.అఖిలరెడ్డి, వై.శ్రీను, జి.లక్ష్మి, బి.శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు పందిరిరాట

మల్కాపురం, జూలై 31: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని ఎగ్జిబిషన్ మైదానంలో భారీ వినాయకుడిని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో బుధవారం నిర్వాహకులు ఏర్పాటు చేసిన పందిరిరాట కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు మొల్లి శ్రీను, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు

అగనంపూడి, జూలై 31: జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, బొండా జగన్, గంధం శ్రీను, ఇల్లపు వరలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ పైలా జగన్నాథరావు, స్థానిక నాయకులు కర్రి దజేంద్ర, గల్లా రాజు, కరణం పైడిరాజు, సత్యారావు, కనకభవానీ, సింగిడి సింహాచలం, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న రౌతు శ్రీనివాస్

కూటమి గెలుపునకు శ్రమించిన కార్యకర్తలకు సన్మానం



సన్మాన గ్రహీతలు బూత్ సభ్యులు, కార్యకర్తలతో నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, జూలై 31: సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ గెలుపు కోసం శ్రమించిన బూత్ కమిటీ సభ్యులు,కార్యకర్తలను బుధవారం టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టించి పనిచేసే కార్యకర్తలను గుర్తించడం, వారిని గౌరవించడం ఒక్క టీడీపీకే సాధ్యమన్నారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు మాడిశ కనకరాజు, ప్రధాన కార్యదర్శి వేగుంట శ్రీనివాస్, నాయకులు ఎం.గణపతి, వెంకటేశ్, జగదీశ్, నాగార్జున,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై అధికారుల సర్వే

అక్కిరెడ్డిపాలెం, జూలై 31: అక్కిరెడ్డిపాలెం ప్రధాన రహదారి నుంచి హైస్కూల్, శ్మశానవాటిక మీదుగా పంచవటి కాలనీ వరకు ఉన్న రోడ్డును విస్తరించేందుకు గాను బుధవారం జీవీఎంసీ అధికారులు, స్థానిక నాయకులు డిజిటల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో స్థానిక నాయకులు గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, బి.రమణ, ఎస్.రాజేశ్, కె.సత్యారావు, నంబారు రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ సామాజిక ఫించన్లు పంపిణీ

గాజువాక, జూలై 31: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో గురువారం ఉదయం ఐదు గంటల నుంచే ఎన్టీఆర్ సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు తెలిపారు. జోన్ పరిధిలో ఓఏపీ ఫించన్లు 14,415, వితంతు ఫించన్లు 10,864, దివ్యాంగులకు 4,395, ఇతర ఫించన్లు 2,534 కలిపి మొత్తం 32,208 మంది లబ్ధిదారులకు గాను రూ.13,82,27,500 పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

బయో టాయిలెట్లపై అవగాహన పెంచాలి: కలెక్టర్

మహారాణిపేట, జూలై 31: బయో టాయిలెట్ల వినియోగంపై అందరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సఫాయి కర్మచారి వ్యవస్థపై వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, టాయిలెట్లను కార్మికులు స్వయంగా క్లీన్ చేసే పద్ధతి కాకుండా ఆధునిక విధానాలు అనుసరించాలన్నారు. కార్మికుల అవసరాలు, సమస్యలు , జీవనోపాధి తదితర అంశాలపై చర్చించారు. పారిశుధ్య కార్మికులకు ఐడీకార్డులు, బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పనిచేసేచోట అన్ని భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు. బహిరంగ మల విసర్జన నష్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్, అధికారులు పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభించేదెన్నడో?

» నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా... అందుబాటులోకి రాని వైనం

మాధవధార, జూలై 31; గ్రేటర్ 51వవార్డు మాధవధారలో సార్వత్రిక ఎన్నికల కోడ్ ని బంధనలనుంచి యంత్రాంగం బయటకురాలేదు. ఇంకా, పలుచోట్ల శిలాఫలకాలపై ముసుగులు అలానే ఉంచేశారు. జూన్ 4న ఫలితాలు వెలువడిన తర్వాత, జూన్ 6వ తేదీతో ఎన్నికల కోడ్ ముగిసింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. కానీ, ఎన్నికల కోడ్ వెలువడిన గత మార్చి 28 తేదీనుంచి కప్పి ఉంచిన పరదాలు నేటికీ పలుచోట్ల తీయలేదు. ఇప్పటి నాలుగు నెలలు గడిచాయి. అలాగే, వార్డులో కళావేదికను గత ఫిబ్రవరిలోనే ఆదరాబాదరాగా వైసీపీ నాయకుడు కేకే రాజు, డిప్యూటీ మేయర్ జె. శ్రీధర్‌తదితరులు ప్రారంభించారు. కానీ, ఇప్పటి వరకు ఓ శుభకార్యం కానీ, సమావేశం కానీ, ఈ వేదికవద్ద నిర్వహించిన దాఖలాలేవు. దాదాపు రూ. 30 లక్షల నిధులతో పరిసరాల్లోని పచ్చదనాన్ని, గ్రీన్ బెల్ట్ లాంటి ఏరియాని పూర్తిగా నామరూపాల్లేకుండా చేసి ఈ కళావేదికను ఎంతో అట్టహాసంగా పూర్తి చేశారు. తీరా, ఎన్నికలు పూర్తయి నెలలు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీని ఎదుట శిలాఫలకంపై ముసుగును కనీసం తొలగించాలన్న ఆలోచన చేయలేదు. ఇకనైనా కళావేదిక వినియోగంలోకి తీసుకురావాలని వార్డు నివాసితులు, అంబేడ్కర్ కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



తొలగించని శిలా ఫలకంపై ముసుగు


నిరుపయోగంగా ఉన్న కళావేదిక

వచన కవిత్వంలో తిలక్‌ది అసమాన ప్రతిభ



సమావేశంలో మాట్లాడుతున్న రాంభట్ల నృసింహ శర్మ.

సీతంపేట, జూలై 31: ప్రముఖ కవి బాలగంగాధర తిలక్ తెలుగు వచన కవితా ప్రక్రియను తన అసమాన ప్రతిభతో ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లారని సాహితీవేత్తలు కొనియాడారు. బాలగంగాధర తిలక్ 103వ జయంతిని పురస్కరించుకుని సృహదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో తిలక్ కవిత్వంపై ప్రముఖ సాహితీవేత్త, భారతీ భూషణ రాంభట్ల నృసింహ శర్మ ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతిచెందిన ప్రముఖ కవయిత్రి కన్నేల్లి వరలక్ష్మికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సహృదయ సాహితి అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షోపాన్యాసం చేశారు. రాంబట్ల నృసింహ శర్మ మాట్లాడుతూ అగ్ని, అమృతం సమపాళ్లలో ఉండేలా తిలక్ రచించారన్నారు. ఆయన కవిత్వంలో భావుకతకు అద్దంపట్టారన్నారు. డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడుతూ తిలక్ భావ కవిత్వం, అభ్యుదయంను తనదైన శైలిలో వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా సూరపనేని విజయకుమార్, సంస్థ కార్యదర్శి చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కేవీఎస్ మూర్తి, కొండేపూడి సర్వేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి ప్రైవేటు పాఠశాలల సమస్యలు

మహారాణిపేట, జూలై 31: ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఎదుర్కొం టున్న సమస్యలు ప రిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసం శెట్టి సుభాశ్‌ను అసోసియేషన్ ప్రతినిధులుకోరారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన మంత్రి ని హోటల్ నోవాటెల్‌లో బుధవారం కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్ , సహాయ కార్యదర్శి శీలం, వీఎస్ఎన్ మూర్తి, జిల్లా అధ్యక్షుడు కె. రామకృష్ణ, డీవీ శ్రీనివాస్, బీ శ్రీనివాస్, గోవింద్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సుభాశ్‌కు వినతి పత్రమిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలకు ప్రణాళిక

సీతంపేట, జూలై 31: డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలకు కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రొగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 200 పాఠశాలల్లో నియమించిన 51,954 పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ లేదా అసిస్టెంట్లతో కంటి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. గతంలోపరీక్షలుచేసిన 3557మందికికళ్లద్దాలను ఉచితంగాఅందిస్తామన్నారు.

రహదారి మధ్య వ్యర్థాల తొలగింపులో అలసత్వం

» మర్రిపాలెం- ఆర్అండ్‌బీ జంక్షన్ దారిలో రాకపోకలకు అవస్థలు

మర్రిపాలెం, జూలై 31: ఇటీవల కురిసిన వర్షాలకు 53వ వార్డు పరిధి మర్రిపాలెం, ఆర్అండ్‌బీ జంక్షన్‌దరి శ్రీరామ్‌నగర్ కాలనీలో భారీ వృక్షం రహదారి మధ్యలో కూలిపోయిన విషయం తెలిసిందే. సంబంధిత అధికారులు, సిబ్బంది చెట్టును పూర్తిగా తొలగించకుండా వదిలి వేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదం జరిగిన రోజు చెట్టు మొదలు యంత్రాలతో కట్‌చేసి, కొమ్మలను తొలగించకుండా వదిలివేశారు. దీంతో ప్రస్తుతం చెట్టు వేరుభాగం, కొమ్మలు రోడ్డంతా విస్తరించి చెల్లాచెదురుగా అధ్వానంగా మారాయి. ఇప్పటికైనాఅధికారులుస్పందించి చెట్టు పూర్తిస్థాయిలో తొలగించాలని పలువురు కోరుతున్నారు.


వదిలేసిన చెట్టు మొదలు


రోడ్డుపై వచ్చిన కొమ్మలు, వ్యర్థాలు

3న 'తుపాకీ సంస్కృతి'పై సదస్సు

సీతమ్మధార, జూలై 31: 'ప్రపంచ వ్యాప్తంగా పెచ్చుమీరుతున్న తుపాకీ సంస్కృతి'పై అనే అంశంపై ఈ నెల 3వ తేదీన ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో సదస్సును నిర్వహిస్తున్నట్టు గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి. బాలమోహన్‌దాస్ తెలిపారు. బుల్లయ్య కళాశాలలో బుధవారం ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. శనివారం ఉదయం 10 గంటలకు గాంధీ సెంటర్‌లో జరిగే ఈ సదస్సులో ప్రపంచ శాంతి కోరే మేధావులు, సామాజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొనాలన్నారు. వివరాలకు ఫోన్: 90324 77463 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, కృష్ణా యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య రామకృష్ణ, డాక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి, అబ్దుల్ మునీర్ ముషాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 31: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అబిద్‌నగర్, షాదీఖానా, రామచంద్రనగర్, ఎంటీసీ పాలెం, బైబిల్‌హౌస్, విద్యుత్‌నగర్ వినియోగదారులు గమనించాలన్నారు.

మాధవధార; తెన్నేటినగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-2 ఈఈ టీకే నాయుడు తెలిపారు. మాధవధార బస్టాపు ప్రాంతం, గ్యాస్ గొడౌన్ జంక్షన్, తెన్నేటినగర్ వాసులు గమనించాలని కోరారు. అలాగే, మాధవస్వామి టెంపుల్ రోడ్, కళింగనగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోర్టు కాలుష్యం సమస్య పరిష్కరించాలి

» ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, జూలై 31: పోర్టు కాలుష్యం సమస్య పరిష్కరించాలని దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. పోర్టు ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు కాలుష్యంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి తాను దక్షిణ నియోజకవర్గంలో పర్యటిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎస్ఆర్ కాలువ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, వెంటనే ఆ పరిసరాలను శుభ్రం చేయాలని కోరారు. దోమలు వ్యాప్తితో పరిసర ప్రాంతాల ప్రజలు కంటిమీద కునుకు లేకుండా ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పోర్టు కాలుష్యంతో నియోజకవర్గంలోని ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో పోర్టు అధికారులు వేణుగోపాల్, శ్రీరామచంద్రమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పాఠశాల విద్య ఎంతో విలువైనది


వాహనాల తనిఖీల్లో ఆర్టీఏ అధికారులు

డాబాగార్డెన్స్, జూలై 31: పాఠశాల విద్య ఎంతో విలువైనదని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు ప్రభాకర్ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని ఆర్‌బీఎంయుపీ పాఠశాలలో శిక్ష సప్తాహ్ శుభతిథి భోజన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ నార్త్‌ఈస్ట్ సభ్యులు సహకారం అందజేశారు. ఈ సందర్భంగా , ప్రాథమిక దశలో బాగా చదువుకోవడం ద్వారా భవిష్యత్తులో రాణించేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల బాగుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌నార్త్‌ఈస్ట్ ప్రెసిడెంట్, సెక్రటరీలు కృష్ణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్, జూలై 31: ఆయుర్వేద పంచకర్మ విధానంపై ఆగస్టు 3 నుంచి 6 వరకుఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు కె.ఎం.ఉన్నికృష్ణన్ నాయర్ నాలుగురోజులపాటుకేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆందోళన, మానసిక ఒత్తిడి, నిద్రలేమీ తదితర సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో సేవలందిస్తారన్నారు. వివరాలకు ఫోన్ 76758 61446లో సంప్రదించవచ్చునన్నారు.

4న భువనేశ్వరి ఆదివాస మహోత్సవం

డాబాగార్డెన్స్, జూలై 31: యాతపాలెంలోని శ్రీభువనేశ్వరి అమ్మవారి ఆదివాస మహోత్సవాన్ని ఆగస్టు 4న ఘనంగా నిర్వహిస్తున్నట్లు భువనేశ్వరి పీఠంఅధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు.ఆ రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

వాహనాలపై 63 కేసులు


వాహనాల తనిఖీల్లో ఆర్టీఏ అధికారులు

మురళీనగర్, జూలై 31 ; విశాఖపట్నం ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం పరిధిలో బుధవారం వాహనాల ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లపై తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 63 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఎన్ఏడీ, హనుమంతవాక, విమ్స్ హాస్పిటల్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. వాహన యజమానులకు హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లపై అవగాహన కల్పించినట్లు ఎంవీఐ గణేష్ రెడ్డి, మాధవి, ఏఎంవీఐలు దుర్గాప్రసాద్, శిరీష ఈసందర్భంగా తెలిపారు. రహదారి నిబంధనలు పక్కా గా అమలులో భాగంగా తనిఖీలు ముమ్మరం చేసినట్టు టీటీసీ జిసి.రాజారత్నం తెలిపారు. వాహనదారులు లైసెన్స్ సమీపంలో ఉంచాలన్నారు. మద్యం సేవించి వాహనాలను డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి'

మహారాణిపేట, జూలై 31: విశాఖ జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. బుధవారం కలెక్టరేటర్‌లో కలెక్టర్‌ను జర్నలిస్టు ప్రతినిధులుకలసి సమస్యలను విన్నవించారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న జర్న లిస్టుల పిల్లలకు గతంలో మాదిరిగా 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌కు చెల్లించాల్సిన ప్రీమియంను సీఎస్ఆర్ నిధుల నుంచి చెల్లింపునకు సహకరించాలన్నారు. జర్నలిస్టు ప్రతినిధులు పి. సత్యనారాయణ, కె. రాము, ఆర్. రామచంద్రరావు, చం ద్రమోహన్, డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

» జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ


హెల్మెట్ అందజేస్తున్న వెంకట శేషమ్మ

డాబాగార్డెన్స్, జూలై 31: ద్విచక్ర వాహనం నడిపేవారితోపాటు, వెనుక కూర్చునే వారూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ తెలిపారు. హెల్మెట్ల వినియోగంపై బుధవారం ఎల్ఐసీ బిల్డింగ్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అనంతరం ఎస్‌బీఐ జిల్లా కోర్టు శాఖ, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎల్ఐసీ శాఖ కార్పొరేట్ , సామాజిక బాధ్యతలో భాగంగా సమకూర్చిన హెల్మెట్లను పలువురికి ఉచితంగా అందించారు.

రూపుదిద్దుకుంటున్న అన్న క్యాంటీన్


టర్నర్ చౌల్ట్రీవద్ద భవనం మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

జగదాంబ కూడలి, జూలై 31: టర్నర్ చౌల్ట్రీ వద్దనున్న అన్న క్యాంటీన్ సరికొత్తగా రూపుదిద్దుకుంటోంది. ఐదేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం తొలగించిన ఈ క్యాంటీన్‌ను ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తిరిగి దీనిని ఏర్పాటు చేసేందుకు జీవీఎంసీ సన్నద్ధమవుతోంది. అన్న క్యాంటీన్ భవనాన్ని మరమ్మతులు చేపడుతున్నారు. లోపల వసతులు కల్పిస్తున్నారు. వన్‌టౌన్‌లో పేదలతోపాటు ఆటో రిక్షా కార్మికులు, షాపుల్లో పనిచేసే చిరుద్యోగులకు అన్న క్యాంటీన్ ఆసరాగా నిలవనుంది.ఆగస్టు 15 తేదీన ప్రారంభం కానున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

ధ్వంసమైన డివైడర్..

» పట్టించుకోని యంత్రాంగం

మురళీనగర్, జూలై 31 ; నగర సోయగాలు ఎప్పటికపుడు మెరుగులు దిద్దుతూ జీవీఎంసీ కొత్తగా నిర్మాణాలు జరపడం... అవి రోజుల వ్యవధిలోనే నామరూపాల్లేకుండా పోవడం సర్వసాధారణంగా మారింది. ఈ క్రమంలో 51వ వార్డులోని ఆర్అండ్‌బీ జంక్షన్ రామన్నకాలనీ వద్ద పైడిమాంబ కాలనీ వద్ద భారీ హోర్డింగ్‌ల ప్రాంతం వద్ద ఇటీవల కొత్తగా డివైడర్లు నిర్మించి రంగులు వేశారు. వాటిపై భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేసిన నాయకులకు గత వైసీపీ పెద్దలు అనుమతులు కూడా మంజూరు చేశారు. అయితే, జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ అమ్మవారి గుడి ఎదుట తీర్చిదిద్దిన డివైడరు ఇటీవల రాత్రి వేళలో గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొనడంతో నేలకొరిగింది. అలాగే, ఇనుప స్తంభాల్లో ఒకటి నేలకొరిగింది. రహదారికి ఆనుకొని ఉన్న ఈ డివైడరు విరిగిపోయింది. రాళ్లు, మట్టి హైవే సర్వీసు రోడ్డులోనే పరుచుకోవడంతో రాకపోకలకు అంతరాయంగా మారింది. అయినా, స్థానిక 287 సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ విభాగం కనీసం పర్యవేక్షించపోవడం గమనార్హం. ఈ రోడ్డులో ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారంలేదని సచివాలయ, టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. వీరితోపాటు సమీపాన ఉన్న ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులకు విషయం తెలియలేదు. ప్రజాధనంతో కట్టిన డివైడర్‌కు నష్టం వాటిల్లడంతోపాటు అటుగా ప్రయాణించే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.


పైడిమాంబ ఆలయం వద్ద చిందరవందరగా మారిన డివైడరు

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

సీతమ్మధార, జూలై 31: గ్రేటర్ 23వ వార్డు నక్కవానిపాలెం చైతన్యనగర్ కనకమ్మవారి వీధి, తదితర ప్రాంతాల్లో జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు శీరపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదును మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. పార్టీ అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశానుసారం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఉమా మమేష్, నరసింగరావు రెడ్డి, డివి రంగారెడ్డి, రమణ, పిల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వయనాడ్, నాడు కోడిపుంజువలస...

... 5వ పేజీ తరువాయి

కొట్టుకుపోయాయి. బండరాళ్లు దొర్లుకొస్తున్నా ఈదురుగాలుల వల్ల ఆ శబ్దం తమకు వినిపించలేదని అప్పట్లో బాధితులు తెలిపారు. 70కి పైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. అప్పటి ప్రభుత్వం స్పందించి ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసి వసతులు కల్పించింది. మృతుల కుటుంబానికి రూ.2.5 లక్షల చొప్పున పరిహారం అందజేసింది. ప్రతి కుటుంబానికి జీవనోపాధి కోసం జత దుక్కిటెడ్లు, నివాసం కోసం మోడల్ కాలనీని మంజూరుచేశారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి సహాయాన్ని అందించాయి. అదే తరహాలో 2014 అక్టోబరు 8వ తేదీన హుద్‌హుద్ తుఫాన్ వల్ల మాదల పంచాయతీ మేదరశాల గ్రామంపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు సజీవ సమాధి అయ్యారు. వరద వల్ల మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొండలను ఆనుకుని చాలా గ్రామాలు ఉన్నాయి. కోడిపుంజువలస ఘటన అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పాలకులు భావించినా చాలామంది సుముఖత చూపలేదు. వయనాడ్ ఉదంతం నేపథ్యంలో జిల్లా అధికారులు కొండవాలు గ్రామాల్లో ఉంటున్న వారి రక్షణపై దృష్టి పెట్టాల్సి ఉంది.

బియ్యం నాణ్యతపై ఆందోళన

... 5వ పేజీ తరువాయి

నాణ్యత లేకపోవడంతో 30 శాతానికిపైగా పిల్లలు పాఠశాలల్లో భోజనం చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా ఒక పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ 1,500 మంది పిల్లలు తమ స్కూలులో గుడ్డు తినేందుకు ముందుకు వస్తున్నారు తప్ప మొత్తం అందరూ భోజనం చేయడం లేదన్నారు. గట్టిగా అడిగితే అన్నం తింటే కడుపు నొక్కుతుందని అంటున్నారని, దీంతో తల్లిదండ్రులు కూడా తమను నిలదీస్తున్నారని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే పౌర సరఫరాల సంస్థ అధికారులు వివరణ ఇస్తూ ఫోర్టి ఫీడ్ (బలమైన) బియ్యం సరఫరా చేస్తున్నామని, 20 శాతం వరకు నూకలు ఉంటాయని చెప్పుకొచ్చారు. హెచ్ఎంలు, నిర్వాహకులు స్పందిస్తూ పిల్లలకు భోజనం తయారీ కోసం నాణ్యమైన బియ్యం ఇవ్వాలని కోరారు. దీనిపై జేసీ స్పందిస్తూ సమావేశంలో వచ్చిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు, నోడల్ ఏజెన్సీలకు సరకులు సకాలంలో అందించాలన్నారు. రేషన్ డిపోల ద్వారా అందించే బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గూన సూర్యప్రకాశరావు, డీఈవో ఎల్.చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, ఐసీడీఎస్ పీవో జయదేవి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మద్దిలపాలెం, జూలై 31: నిర్వహణ పనుల నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. చైతన్యనగర్, చిన్నకనకమ్మవారి ఆలయం వీధి, పెద్దనుయ్యి, గాయత్రి స్కూల్, శివాలయం, సీఎంఆర్ శ్మశానవాటిక, ఎంవీపీ భవన్, శివాలయం వీధి, కేఆర్ఎంకాలనీ ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

కొమ్మాది, మధురవాడ ప్రాంతంలో రేపు

కొమ్మాది: మారికవలస ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు నరేశ్, అప్పలనాయుడు తెలిపారు. మారికవలస జంక్షన్, మారికవలస, బోరవానిపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, డ్రైవర్స్‌కాలనీ, జేకే లేఅవుట్, కొత్తపరదేశిపాలెం, పాతపరదేశిపాలెం, పీఎం పాలెం ఫీడర్ పరిధి గాయత్రినగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, విజేత సూపర్‌మార్కెట్, పీఎంపాలెం రెండో బస్టాప్ ఏరియా, ఏపీహెచ్‌బీ కాలనీ, కార్‌షెడ్ ఏరియా, పిలకవానిపాలెం, సాంకేతిక కళాశాల ఏరియా, పోస్టాఫీస్ ఏరియాలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

మధురవాడ: మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యనగర్, ఆర్టీసీ కాలనీ, మానం ఆంజనేయనగర్, నగరంపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆశ్రమ పాఠశాలకు ఆర్థిక సాయం

పెదవాల్తేరు, జూలై 31: లాసన్స్ బే కాలనీలోని శాంతి ఆశ్రమ పాఠశాలకు బీజేపీ మైనారిటీ మోర్చా ఇన్‌చార్జి అధ్యక్షుడు షేక్ నూర్ బాషా షరీఫ్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ధనేశ్వరరావు, చింతాడ మోహన్‌రావు, మురళీమోహన్‌రాజు, లెంక శ్రీరామ్ పాల్గొన్నారు.

హిందీ పరీక్ష ఫీజు గడువు పెంపు

భీమునిపట్నం, జూలై 31: దక్షిణ భారత హిందీ ప్రచార సభ చెన్నై నిర్వహించే హిందీ పరీక్షలకు ఈనెల 5వ తేదీ వరకూ రూ.10ల అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చని ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు తెలిపారు. జూలై నెలాఖరుతో ఫీజు గడువు ముగిసిందన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పద్మనాభం, జూలై 31: మండలంలోని కృష్ణాపురంలో ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమైన నాయీ బ్రాహ్మణుడు ఎస్.నారాయణరావుకు స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు బియ్యం, నగదు పంపిణీ చేశారు. ఈమేరకు బాధితుగు నారాయణరావు ఇంటికి వెళ్లి అతనిని పరామర్శించారు. 25 కిలోల బియ్యంతో పాటు రూ.వెయ్యి నగదును అందజేశారు.

టీడీపీ విజయోత్సవ సభ వాయిదా

పద్మనాభం, జూలై 31: పద్మనాభంలో బుధవారం జరగాల్సిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విజయోత్సవ సభ వాయిదా వేసినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ చెప్పారు. పలు గ్రామాల్లో ప్రజలు వ్యవసాయ పనులలో నిమగ్నం కావడంతో నాయకుల విజ్ఞప్తి మేరకు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. త్వరలో మరో తేదీ ప్రకటిస్తామన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

పద్మనాభం(రూరల్), జూలై 31: మండలంలోని 22 పంచాయతీల పరిధిలో 7,956 మంది లబ్ధిదారుల పింఛన్ల పంపిణీకి రూ.3.23 కోట్లు మంజూరైనట్టు ఎంపీడీవో బి. శైలజ తెలిపారు. గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు గురువారం ఉదయం 6 గంటల పంపిణీ చేస్తామన్నారు.

వెలగని వీధి దీపాలతో ఇక్కట్లు

ఆరిలోవ, జూలై 31: జీవీఎంసీ 12వ వార్డు కొండవాలు ప్రాంతాలలో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు బిక్కు బిక్కుమంటూ చీకటిలో గడపుతున్నారు. అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో వీధి కుక్కలు, విష జంతువుల సంచారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈశ్వరదేవి నగర్ కొండవాలు ప్రాంతంలో ఈ సమస్య అధికంగా ఉందని, అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 32, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 26, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 38, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 150, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 42, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 78, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	82
ఫారం ధర	--	102
విత్ స్కిన్	--	174
స్కిన్‌లెస్	--	184

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..

రహదారి ఇలా...పాఠశాలకు వెళ్లేది ఎలా?

- రోడ్డుపై మురుగునీటితో ఇబ్బందులు
- యూజీడీ గోతులు పూడ్చక అవస్థలు


పొంగిపొర్లుతున్న యూజీడీ మేన్‌హోల్


మురుగులో నడిచేందుకు విద్యార్థుల ఇక్కట్లు

వెంకోజీపాలెం, జూలై 31: గ్రేటర్ 15, 16వ వార్డుల మధ్యనున్న ప్రధానమార్గంలో అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ నూతన పైపులైను ఏర్పాటు కోసం తవ్వి అసంపూర్తిగా కప్పివేయడంతో గోతుల్లో నీరు చేరి, బురదమయింది. తాజాగా ఈ మార్గంలో మురుగునీరు నిండిపోవడంతో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వాహనచోదకులు, పాదచారులు తీవ్ర తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాత వెంకోజీపాలెం కూడలి వద్ద ప్రధాన సమస్యగా మారిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మేన్‌హోల్ పొంగి మురుగు కింది వీధులకు ప్రవహిస్తోంది. దీనికి నూతన పైపులైను అమరిక కోసం తవ్విన గోతులలో బుధవారం మురుగునీరు చేరిపోవడంతో స్థానికులు తమ పిల్లలను పాఠశాలలకు ఎలా పంపించాలో తెలియక ఆందోళన చెందారు. కొండపైన నివాసితుల నుంచి వచ్చే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మేన్‌హోల్ ఈ కూడలి వద్దకు వచ్చేసరికి ఎల్ షేప్‌లో మలుపు తిరుగుతుంది. ఇదే కూడలిలో మంచినీటి ప్రధాన పైపులైను కూడా ఉండడంతో మురుగునీటి మేన్‌హోల్‌ను నిర్మాణ సమయంలోనే మలుపు తిప్పక తప్పలేదు. అయితే వర్షం కురిసినప్పుడు, ఆ తరువాత రెండు, మూడు రోజుల వరకు మేన్‌హోల్ పొంగి మురుగునీరు వాధుల్లోకి ప్రవహిస్తోంది. 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఇంటి సమీపంలోనే ఈ సమస్య ఎదురవుతున్నాస్పందించలేదు. అధికారులైనా గుర్తించి, పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు


విద్యార్థులతో మాట్లాడుతున్న నాగరాజు

భీమునిపట్నం, జూలై 31: ప్రస్తుత ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీసీ బాలికల కాలేజీ హాస్టల్‌ను, బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి మెస్‌చార్జీ రూ.2,500లకు పెంచాలని, కాస్మోటిక్స్, మెస్‌ఛార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతీ హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్‌ను, కుక్, కమాటీ, ట్యూటర్, వాచ్‌మేన్ పోస్టులను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.. హాస్టల్ భవనాలను మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా, ఆయా హాస్టల్స్‌లో మెనూ ప్రకారం, భోజనాలు అందిస్తున్నారా.. లేదా.. పరిశీలించారు. అనంతరం, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. హాస్టల్ సమస్యలపై బీసీ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీను నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ధర పెంపుపై కొనుగోలుదారుల ఆందోళన


స్టాక్ పాయింట్ వద్ద కొనుగోలుదారుల ఆందోళన

భీమునిపట్నం, జూలై 31: ఉచిత ఇసుకపై ప్రభుత్వం ఆకస్మాత్తుగా టన్నుకు రవాణా చార్జీల పేరిట రూ.318లు పెంపు చేయడంపై కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తొలుత టన్ను ఇసుక రూ.758లకు అందిస్తున్నట్లు ప్రకటించింది. భీమిలి కృష్ణాకాలనీలో ఉన్న బుధవారం స్టాక్ పాయింట్ వద్ద ఆన్‌లైన్‌లో ఇసుక ధర పెరిగిందని సిబ్బంది చెప్పడంతోకొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తంచేశారు. టన్ను ప్రస్తుత ధర రూ.1076 చెల్లించాలని కోరడం దారుణమని పలువురు కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. భీమిలి స్టాక్ పాయింట్‌కు శ్రీకాకుళం జిల్లా చవ్వాకులపేట శాండ్ ర్యాంప్ నుంచి ఇసుక వస్తుందని, అగనంపూడి స్టాక్ పాయింట్‌కు రాజమండ్రి నుంచి ఇసుక వస్తుంది. అగనంపూడిలో తొలుత టన్ను ఇసుకధర రూ.1394, భీమిలిలో రూ.758 వుండేది. దీంతో ధరలో వ్యత్యాసం కనబడడంతో ఇసుకకు అధికంగా భీమిలి పాయింట్ వద్దకు లారీలు, ట్రాక్టర్లు ఇసుక కోసం వస్తుండేవి. దీంతో జిల్లా శాండ్ కమిటీ ఆలోచించిపై రెండు స్టాక్ పాయింట్‌ల్లో ఒకే ధర ఉండేలా ఇసుక టన్ను ధర రూ.1076గా నిర్ణయించినట్టు మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ శంకరరావు తెలిపారు. ఇపుడు ఒకేచోటా రద్దీ కనిపించడంలేదు. అయితే, శ్రీకాకుళం నుంచి భీమిలి స్టాక్ పాయింట్ దగ్గరగా ఉండడంతో రవాణా ఛార్జీలు తగ్గుతాయని, అలాంటపుడు తామెందుకు టన్నుకు రూ.318 అదనంగా చెల్లించాలని ఈ ప్రాంత కొనుగోలు దారులు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా ఉచిత ఇసుక అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఈ విధంగా రవాణా చార్జీల పేరిట అధిక ధరలు వసూలు చేయడం సమంజసం కాదని వారు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే వెలగపూడిని కలిసిన మసీదు పెద్దలు

ఎంవీపీ కాలనీ, జూలై 31: ఆరిలోవలోని ముస్తాఫాకాలనీ సామాజిక భవనం మసీదు కమిటీకి అప్పగించాలని ముస్లింలు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కోరారు. బుధవారం ఆయన కార్యాలయంలో మస్జిద్ ఈ ముస్తఫా సంఘం అధ్యక్షులు సాహెబ్ షేక్ యాసిన్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ ప్రాంతంలోని ఐదు మసీదుల్లో సుమారు 1500 కుటుంబాలు ఉన్నాయని, మహిళలకు టైలరింగ్, ఇతర స్వయం ఉపాధి పథకాలకు సంబంధించిన శిక్షణకు ఇవ్వడానికి సామాజిక భవనం ఉపయోగపడుతుందన్నారు. సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముగడ రాజారావు, రాగతి అచ్యుతరావు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం

మద్దిలపాలెం: ముస్లిం సోదరుల అభివృద్ధికి అండగా ఉంటామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ హామీ ఇచ్చారు. స్థానిక 22వ వార్డు మంగాపురం కాలనీలో బుధవారం తారా యూత్ సభ్యుల భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తారామసీదు పెద్దలు యువత కోసం మసీదు పైన నిర్మాణం చేసుకునేందుకు అవకాశమివ్వడం సంతోషమన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో మాట్లాడి తగిన సహాయం కావాలన్నా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మదినవల్లీ, షరీఫ్, బాబా పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి సహకరిస్తా

వెంకోజీపాలెం: పాత వెంకోజీపాలెం గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పుట్టమన్ను సేకరించే ప్రాంతంలో చిన్నపాటి మందిరాన్ని నిర్మించాలని శ్రీరాధాకృష్ణ యాదవ సేవాసంఘం, శ్రీసీతారామ సేవా సంఘం, శెట్టిబలిజ సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కోరారు. బుధవారం ఆయనను కలిసి స్థలం వివరాలను తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల తరువాత మంత్రితో మాట్లాడి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఒమ్మి ముత్యాలనాయుడు, ఆడారి పరదేశి, సంపంగి మంగరాజు, సీహెచ్ గోవింద్, తదితరులున్నారు.

'పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారు'


వంటా వార్పుతో నిరసన తెలుపుతున్న రైతులు

కొమ్మాది, జూలై 31: బక్కన్నపాలెంలో హుద్‌హుద్ ఇళ్ల నిర్మాణానికి భూములు తీసుకుని నష్టపరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, కొమ్మాది రైతులు బుధవారం వంటావార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బంక పోతురాజు, ఎస్.పైడిరాజు, ఎస్.పైడితల్లి, కె.నాగరాజు, దుర్గాకుమారి సీపీఎం కార్యదర్శి డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

భీమునిపట్నం, జూలై 31: గుండె సంబంధిత వ్యాధితో భీమిలి తోటవీధికి చెందిన డిగ్రీ విద్యార్థిని రాకోతు నిత్యశ్రీ బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆఫ్ భీమిలి వారు బుధవారం రూ.10వేల సహాయాన్ని అందించారు. నిత్యశ్రీకు హైదరాబాద్‌లో లేజర్ చికిత్స చేయించాల్సి ఉం దని, దానికి రూ.10 లక్షలు అవసరమని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. దాతలు సాయమందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు ముసునూరి శ్రీనివాసరావు, కాళ్ల సన్ని, కట్టమూరి రమణారావు, మారోజు గోపి పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఓడీఎఫ్ సర్వే

పద్మనాభం (రూరల్), జూలై 31: ఓడీఎఫ్‌పై సర్వేను అనంతవరం, పెంట. గంధవరం గ్రామాల్లో బుధవారం చేపట్టారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి, మూత్రశాలలను నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన నిరోధంలో భాగంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఇంకుడు గుంతలను పరిశీలించామన్నారు. సాంకేతిక లోపం కొంత సమయం అంతరాయం నెలకొంది. ఈ కార్యక్రమంలో అయా గ్రామాలకు చెందిన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిశోర్‌బాబు

వెంకోజీపాలెం, జూలై 31: ఏయూ సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ (సీఎస్ఎస్ఐయూ)లో బుధవారం 'భారతదేశంలో బాల కార్మికుల నిర్మూలన -ఒక మార్గం' అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దోపిడీ, సామాజిక ముప్పు సమగ్రాభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందన్నారు. బాల కార్మికులు వ్యాప్తి చెందడానికి పేదరికం, జనాభా విస్ఫోటనం, పెద్దగృహాలు, లాభదాయకమైన ఉపాధికి అవకాశం లేకపోవడం, ఆర్థిక భద్రత, తల్లిదండ్రుల నిరక్షరాస్యత, అజ్ఞానం, సంప్రదాయ వైఖరులు, సామాజిక వెనుకబాటుతనం కారణమన్నారు. బాలకార్మిక నిర్మూలనకు ప్రచారాల ద్వారా అవగాహన కల్పించడం, తరగతి గదికి ప్రాధాన్యత ఇవ్వడం, చట్టాలు అమలుచేయడం, ఎన్‌జీవోలకు మద్దతు ఇవ్వడం సహకరిస్తాయన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీత చట్టపరమైన నిబంధలను తెలిపారు. కౌమార కార్మికులు (నిషేధం, నియంత్రణ) చట్టం 1986, 2016 జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ పోషించిన పాత్రను ప్రస్తావించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆచార్యులు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షల పరిశీలన

వెంకోజీపాలెం: ఆర్ట్ కళాశాల పరిధిలో నిర్వహిస్తున్న సెమిస్టర్ పరీక్షలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు బుధవారం పరిశీలించారు. జర్నలిజా విభాగాన్ని సందర్శించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న తీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగం ఆచార్యులు, ఏయూ మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా బంగారు తులసి దళాల పూజ


స్వర్ణ తులసి దళార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం, జూలై 31: వరాహలక్ష్మీనృసింహ స్వామికి బుధవారం బంగారు తులసిదళాలతో పూజలు నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా ఏకాదశి పుణ్యదినాల్లో ఈ అర్చన చేస్తారు. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి బంగారు తులసీ దళాలను తెచ్చి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ తులసి దళాలతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.


కోలాటం ఆడుతున్న మహిళలు

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని రెల్లివీధికి చెందిన కుంచుమాంబ వర్తకసంఘం ప్రతినిధులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. పీఆర్‌వో డి.అప్పలనాయుడుకు నగదు అందజేశారు. దాత కుటుంబసభ్యులకు అంతరాలయంలో స్వామివారి దర్శనాన్ని కలిపించారు. పండితులు వేదాశీర్వచనాలీలు, అధికారులు ప్రసాదాలు అందజేశారు.

భక్తితత్వాన్ని చాటిన కోలాటం

సింహాచలం: ఆలయ ప్రాంగణంలో కోలాటం భక్తితత్వాన్ని చాటింది. గాజువాక సమీప సుందరయ్యకాలనీకి చెందిన శ్రీరామ కోలాట బృందం ప్రధాన రాజగోపురం వద్ద భక్తిగీతాలతో కోలాటమాడారు. అధికారులు బృంద సభ్యులకు స్వామివారి దర్శనం, తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం బుధవారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో వైభవంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పవళింపు సేవ అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి పల్లకిలో ఉంచారు. మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామికి ఫలాలు సమర్పించి, కర్పూర నీరాజనాలిచ్చారు. పర్యవేక్షణాధికారి వెంకటరమణ ఉత్సవ ఏర్పాట్లను చేశారు.


స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

వార్డు అభివృద్ధికి సహకరించాలని వినతి


ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ మంగమ్మ

మధురవాడ, జూలై 31: వార్డు పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి సహకరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ బుధవారం వినతి పత్రం అందించారు. నగరంలోని గంటా స్వగృహంలో ఆయనను కలిసి వార్డు సమస్యలు వివరించారు. రహదారులు, కాలువలు నిర్మించాలని, వీధిదీపాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఆమె వెంట పిళ్లా వెంకటరావు ఉన్నారు.

జోరుగా జనసేన సభ్యత్వ నమోదు


సభ్యుడికి రశీదు అందిస్తున్న పంచకర్ల సందీప్

కొమ్మాది, జూలై 31: సభ్యత్వ నమోదులో 5వవార్డు ముందుందని భీమిలి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ అన్నారు. మారికవలసలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా 1,230 సభ్యత్వాలు నమోదు చేయించిన వార్డు జనసేన అధ్యక్షుడు దేవరశివను అభినందించారు. అతనిని పార్టీ శ్రేణులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య, ఎస్.ఎస్.నాయుడు, ఆదినారాయణ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ఆనందపురం జూలై 31: ప్రతి ఒక్కరికీ ఆర్థిక లావాదేవీలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఆర్‌బీఐ ఎల్‌డీవో పార్నిపల్లి పూర్ణిమ అన్నారు. మండలంలోని లొడగలవానిపాలెంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ఏకీకృత ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బ్యాంకులు అందిస్తున్న ఇన్యూరెన్స్, ప్రమాద బీమా పథకాలు, వడ్డీ రాయితీలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి ద్వారా లబ్ధి పొందాలన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు పలు అంశాలపై సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జి.నాగభూషణరావు, సీసీలు కె.భాస్కరరావు, జి. అప్పలనాయుడు, పి.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

'పురోహితులను ప్రభుత్వం ఆదుకోవాలి'

మధురవాడ, జూలై 31: పురోహితులకు ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమాఖ్య డిమాండ్ చేసింది. మధురవాడ శిల్పారామంలో బుధవారం సమాఖ్య ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీలక్ష్మీ గణపతిహోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన తెన్నేటి విద్యాధరశాస్త్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో అధిక శాతం పురోహితులు చాలీచాలని ఆదాయంతో కుటుంబాలను గడుపుతున్నారన్నారు. ఈ స్థితిలో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విశేష సేవలందించిన పురోహితులకు విప్రసేవక్ పురస్కారాలను అందించారు.అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, అధ్యక్షుడు నారాయణమూర్తి, ప్రధానకార్యదర్శి దుర్గబాబు, అధికారప్రతినిధి రవి, కోశాధికారి మణిశంకర్, ఉమామహేశ్వరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజనీకుమార్ శర్మ, విశాఖ జిల్లా అధ్యక్షుడు సత్యశ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ వినియోగించుకోండి: డీఈ

మధురవాడ, జూలై 31: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగంతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గించుకోవాలని జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు కోరారు. మధురవాడ విద్యుత్ కార్యాలయంలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలకు రూ.1000కి పైగా విద్యుత్ బిల్లులు చెల్లించేవారికి ఈ పథకం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇంటి శ్లాబుపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తారన్నారు. దీని ద్వారా కిలోవాట్‌కు 120 యూనిట్లు, 2 కిలోవాట్లకు 240 యూ నిట్లు, 3కిలోవాట్లకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. వీటిని ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం కిలో వాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్లకు రూ.60వేలు, 3 కిలోవాట్లకు రూ.78వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ పథకం అమలకు బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తాయని డీఈ తెలిపారు. వివరాలకు 1912 టోల్‌ఫ్రీని కానీ, విద్యుత్ కార్యాలయ పనివేళల్లో నేరుగా సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ కిరణ్‌ను అభినందిస్తున్న సిబ్బంది

ఆరిలోవ, జూలై 31: చినగదిలి రూరల్ మండల తహసీల్దార్‌గా పాల్‌కిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకులం జిల్లా పొందూరు మండలం తహసీల్దార్‌గా ఎన్నికల సమయంలో బదిలీపై పాల్‌కిరణ్ వెళ్లారు. తిరిగి ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు.

ప్రేమ్‌చంద్‌కు ఘన నివాళి


రచయిత ప్రేమ్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, జూలై 31: బీచ్‌రోడ్‌లోని జీఎస్ఆర్ భవన్‌లో హిందీ సాహిత్య రంగానికి ఎనలేని సేవలందించిన మున్షీ ప్రేమ్‌చంద్ 144వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆదర్శ హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ మున్షీ ప్రేమ్‌చంద్ హిందీ సాహిత్య రంగానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల సూర్య రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో శుభ దిన్ భోజన్

వెంకోజీపాలెం, జూలై 31: పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుభదిన్ భోజన్ (తిథి భోజన్) నిర్వహించారు. దాత శరగడం సన్యాసమ్మ విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీహెచ్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యుర్థులు సహపంక్తి భోజనం చేశారు.

ప్రాచీన హస్తకళలను పరిరక్షించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోట దేవకీ దేవి

సిరిపురం, జూలై 31: ప్రాచీన హస్తకళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా స్టేట్ కమిటీ సభ్యులు కోట దేవకి దేవి అన్నారు. బుధవారం కేపీ పాల్ ఫంక్షన్ హాల్‌లో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్వాక్రా ఎగ్జిబిషన్‌ను స్టేట్ కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. ఇటువంటి ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం హస్తకళాకారుల ప్రోత్సాహానికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా, స్టేట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.